
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

సోమవారం 14 జూలై 2025



- కూలీల కొరతతో అన్నదాతలు సతమతం
- పత్తి చేలల్లో పెరుగుతున్న గడ్డి మొక్కలు
- రైతులకు తప్పని మందుల స్ప్రే
- జిల్లాలో చివరి దశకు చేరుకున్న పత్తి సాగు
- వానాకాలం సాగు 2.43 లక్షల ఎకరాల అంచనా

జిల్లాలో ఖరీఫ్ సాగు ఇలా..

మండలం	వరి	పత్తి	ఇతర	మొత్తం
గంభీరావుపేట	18,600	200	530	19,330
ఇల్లంతకుంట	24,000	12,500	1,970	38,470
ముస్తాబాద్	23,000	600	1,650	25,250
సిరిసిల్ల	4,900	850	103	5,853
తంగళ్లపల్లి	19,950	1,000	1,081	22,031
వీర్నపల్లి	8,360	400	32	8,792
ఎల్లారెడ్డిపేట	17,500	3,600	30	21,130
బోయినపల్లి	13,000	7,000	1,310	21,310
చందుర్తి	15,200	6,200	210	21,610
కోనరావుపేట	18,200	4,800	700	23,700
రుద్రంగి	5,900	3,400	805	10,105
వేములవాడ	5,200	5,010	368	10,578
వేములవాడ రూరల్	11,050	4,200	364	15,614
మొత్తం	1,84,860	49,760	9,153	2,43,773



కలుపు కష్టాలు..

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తెల్ల బంగారంగా దిగుబడినిస్తుందని ప్రతి ఏటా రైతులు పత్తి వైపు మొగ్గు చూపుతూ అనేక కష్టాల మధ్య సాగు చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్లో ప్రధానంగా వరి తర్వాత పత్తి పంట సాగు చేస్తారు. రోహిణి కార్తెలోనే ముందస్తుగానే వర్షాలు మురిపించి తర్వాత ముఖం చాటేశాయి. దీంతో పత్తి విత్తనాలు భూమిలోనే మాడిపోతాయని, మొలకెత్తిన విత్తనాలు ఎండిపోతాయని ఆందోళన చెందుతున్న క్రమంలో ఈనెల మొదటి వారంలో కురిసిన వర్షాలు పత్తికి జీవం పోశాయి. మళ్లీ రైతుల్లో పంట చేతికి వస్తుందని ఆశలు కల్పించాయి. జిల్లాలో నైరుతి ముందే వచ్చిందని రైతులు ముందస్తుగానే పత్తివిత్తనాలు నాటుకున్నారు. అయితే పత్తి మొలకెత్తిన రైతులకు ఇప్పుడు కలుపు కష్టాలు మొదలయ్యాయి. కలుపు విపరీతంగా పెరుగుతుండడం, మరోవైపు కూలీల కొరత ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో పత్తి రైతులు కలుపు తీయడానికి రోజు కూలి రూ 450 నుంచి రూ 500 వరకు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో 49,760 ఎకరాల్లో పత్తిసాగు లక్ష్యంగా పెట్టుకోగా, రైతులు ఇప్పటివరకు 39,540 ఎకరాల్లో విత్తనాలు వేసుకున్నారు. దీంతో పాటు మొక్కజొన్న 2,393 ఎకరాలు, కందులు 279 ఎకరాలు, పెసర 10 ఎకరాలు, ఇతర పంటలు 56 ఎకరాల్లో వేసుకున్నారు.

కలుపు నివారణకు మందుల స్ప్రే..

గడ్డిమందు నిషేధంతో పత్తి సాగులో కలుపు తీయడానికి రైతులకు ఇబ్బందులు మొదలయ్యాయి. చేన్లలో ఎక్కువగా తుంగ, గరక, గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా పెరిగాయి. వీటి నివారణకు గతంలో గడ్డి మందు ఎక్కువగా ఉపయోగించే వారు. గ్లైకోసెట్ వంటి మందులు జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని, క్యాన్సర్ వంటి వాటికి దారి తీస్తుందని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దీనికి ప్రత్యామ్నాయంగా వచ్చిన మందులు కలుపును నివారించడానికి ఉపయోగపడడం లేదని రైతులు చెబుతున్నారు. కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలు కలుపు మొక్కలు పెరగడంతో నిషేధిత మందులను కూడా స్ప్రే చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు వివిధరకాల పేర్లతో వస్తున్న కలుపు నివారణ మందులను విరివిగా స్ప్రే చేస్తున్నారు. కలుపు నివారణ మందులపై రైతులు ఆధార పడుతున్నారు. జిల్లాలో డ్రోన్ ద్వారా మందులు స్ప్రే చేస్తే ఎకరానికి రూ 600వరకు తీసుకుంటున్నారు. ఖర్చు ఎక్కువ అవుతున్న తప్పని పరిస్థితుల్లో రైతులు గడ్డి మందులను ఉపయోగిస్తున్నారు.

కూలీల కొరతతో వరి నాట్లకు ఇబ్బందులే..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పునాస పంటలకు కూలీల కొరత ఇబ్బందిగా మారింది. వర్షాలు సమృద్ధిగా లేక పోవడంతో..

మిగతా 8లో

స్పెషల్ టూర్ ప్యాకేజీని సద్వినియోగం చేసుకోవాలి

ఆర్టీసీ సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్‌రావు



బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ ప్రకాష్‌రావు

సిరిసిల్ల టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ సిరిసిల్ల డిపో నుంచి దైవదర్శనం కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ ఏ ప్రకాష్‌రావు అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో దైవదర్శన ఐదవ స్పెషల్ టూర్ ప్యాకేజీ డీలక్స్ బస్సును డిపో మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు, భక్తుల కోరిక మేరకు త్వరలో చిలుకూరు బాలాజీ, భద్రాచలం, పంచరామాలు, సింహాచలం, అన్నవరం, రామప్ప, లక్నవరం దేవాలయాల దర్శనం కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ వర్జిలాల్, టీఐ3 బాపురెడ్డి, రాంరెడ్డి నాయక్, సంతోష్‌నాయక్, మల్లేశం పాల్గొన్నారు.

రేపు సిరిసిల్లలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

సిరిసిల్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు ఈనెల 15న సైకిళ్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి తెలిపారు. సిరిసిల్లలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేరుతో పదో తరగతి విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సిరిసిల్ల పట్టణంతోపాటు తంగళ్లపల్లి మండలానికి చెందిన పదవ తరగతి విద్యార్థులకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ స్వయంగా పాల్గొని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేస్ బీగీతే, జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్‌లతో కలిసి విద్యార్థులకు సైకిళ్లను అందిస్తారని తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రతి మండల కేంద్రాల్లో దశలవారీగా పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లను అందించేందకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పదో తరగతి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని గోపి కోరారు. ఈ సమావేశంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, పోన్నాల తిరుపతిరెడ్డి, సిరిసిల్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.

‘దర్పణం’ నేటి యువతకు తోడ్పాటు..

- జిల్లా సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య



సిరిసిల్లలో దర్పణం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

సిరిసిల్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : దర్పణం నేటి యువతకు తోడ్పాటును అందించడంతో పాటు రాబోయే తరానికి ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్ హనుమాన్ మందిరంలో జిల్లా సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జనపాల శంకరయ్య అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో కోనరావుపేట మండలానికి చెందిన యువ రచయిత చక్రాల మల్లేష్ రచించిన దర్పణం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు జనపాల శంకరయ్య మాట్లాడుతూ కాయం గాయం అయినాగానీ జీవం ఇచ్చిన అమ్మతనం ద్వేషం కోసం ఏమో గానీ భాష్యం పంచు అమో గుణం అనే కవితలో లోతుగా అలోచిస్తే కన్నీళ్లు తెప్పిస్తుందన్నారు. రాబోయే ఈశా శతకమునకు చక్కని భక్తి పారవశాన్ని ఆవిష్కరించబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, మున్సిపల్ మాజీ చైర్మన్ అడెపు రవీందర్, మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, బాల సాహితీవేత్త వాసరవేణి పర్శరాములు, వ్యాపార సంఘం ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, బూర దేవానందం, గడ్డం పర్శరాములు, సుల్తానా మల్లేష్, గోపాల్‌రెడ్డి, అంకారపు రవి, అంకారపు జ్ఞానేభా, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామంలో లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆదివారం పంపిణీ చేశారు. నర్సయ్య, నారాయణరెడ్డి, మహేందర్, రాజు, పర్శరాములు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఈవో



వన మహోత్సవంలో మొక్కలు నాటుతున్న ఈవో

7

ఊరూరా బోనాల సందడి..



సిరిసిల్ల పట్టణంలోని పోచమ్మ దేవాలయంలో భక్తుల రద్దీ



బోనాలతో అభయాంజనేయ అసోసియేషన్ మహిళలు..



వీర్నపల్లిలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

సిరిసిల్ల టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం భక్తిశ్రద్ధలతో మహిళలు బోనమెత్తి అమ్మవారికి మొక్కులను సమర్పించుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని పలు వాడల నుంచి మహిళలు బోనమెత్తుకొని డప్పుచప్పుళ్లతో ప్రదర్శనగా వెళ్లి పోచమ్మ దేవాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఆషాఢ మాసం కావడంతో పోచ్చమ్మ దేవాలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. సిరిసిల్ల పట్టణం 3వ వార్డుతో పాటు, విద్యానగర్ శ్రీఅభయాంజనేయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మూల స్వరూపతిరుపతిరెడ్డి బోనం ఎత్తుకొని అసోసియేషన్, వార్డు సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, కోశాధికారి శేఖర్, సభ్యులు వెల్మూల తిరుపతిరెడ్డి, ధర్నారెడ్డి, రాజేందర్, తిరుపతిరెడ్డి, ప్రసాద్ దేవేందర్, శ్యాం, దేవయ్య రాములు, శంకర్, సతీష్ పాల్గొన్నారు.

- సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణంలోని పలువార్డులల్లో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని వెంకంపేట, అంబికానగర్, నెహ్రూనగర్, బీవైనగర్, గణేష్‌నగర్, తారకారామ నగర్, సంజీవయ్యనగర్‌లలోని అన్ని కులాలకు చెందిన ప్రతి కుటుంబం నుంచి మహిళలు పోచమ్మ పండుగ సందర్భంగా మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని ఒగ్గుడోలు, డప్పుచప్పుళ్లతో శిగాలు ఊగుతూ ఊరేంగిపుగా పోచమ్మ దేవాలయాలకు దేవాలయాన్ని చేరుకుని బోనాలతో నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, ఈ తాజీ మాజీ కౌన్సిలర్‌లు దిడ్డి మాధవిరాజు, గుండ్లపెల్లి రామానుజం, గడ్డం లత భాస్కర్, కల్లూరి లత మధు, చిలుక నారాయణలతోపాటు జిల్లా డైయింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జగ్గాని మల్లేశం యాదవ్, నాయకులు గుండ్లపల్లి గౌతమ్, చిమ్మని ప్రకాష్, జిందం సుధాకర్, చిలుక రాజేశం, గాజుల రవీందర్, పోలాస మల్లేశం, దేవత ప్రభాకర్, మేర్గు వీరేశం, ఊర గోండ రాజు, దిడ్డిరాజు తదితరులు పాల్గొన్నారు.
- ఇల్లంతకుంట : మండలకేంద్రంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళలు బ్రహ్మంగారి గుడి నుంచి డప్పుచప్పులు, శివసత్తుల పూనకాల మధ్య బోనాలు ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి చేరుకొని వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు పండాలని వేడుకుంటూ నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, సంఘ నాయకులు తిప్పారపు సంతోష్‌కుమార్, నాగరాజు, సురేష్, శ్రావణ్, సతీష్, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.
- వీర్నపల్లి : మండల కేంద్రంలోని జీవనజ్యోతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు గ్రామ దేవతలకు బోనాలు తీసి ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. జీవనజ్యోతి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలోని స్వశక్తి గ్రూప్ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని అన్ని కులదేవతలకు జలాభిషేకం చేసి డప్పుచప్పులతో బోనాలు తీశారు. మహిళా సంఘాలు అన్ని రంగాల్లో రాణించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ శ్యామల, వీవోఏ పద్మ, వీవో అధ్యక్షురాలు నీలం కవిత, కార్యదర్శి స్వాతి, కోశాధికారి నర్సవ్వ, ఆయా స్వశక్తి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.
- గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో మహంకాళి అమ్మవారికి, నర్మాలలో పోచమ్మతల్లికి ఆదివారం ప్రజలు బోనాలను తీశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పచ్చగా పండాలని అమ్మవారిని వేడుకుంటూ బోనాలు సమర్పించారు. కాగా, మండల కేంద్రంలో వర్షాలు కురవాలని వన భోజనాలకు వెళ్లారు. పెద్దఎత్తున ప్రజలు తాళ్ల ఎల్లమ్మ ఆలయం వద్దకు వనభోజనాలకు తరలివెళ్లారు. ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆ ప్రాంతం కిటికిటలాడింది.



నర్మాలలో పోచమ్మ బోనాలు తీస్తున్న మహిళలు



సిరిసిల్ల నెహ్రూనగర్‌లో పోచమ్మ బోనాల ఊరేగింపు



సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలో పోచమ్మ బోనాల ఊరేగింపు



ఇల్లంతకుంటలో బోనాలతో మహిళలు..

తెగని సరిహద్దు వివాదం..

- ఎన్నికలను బహిష్కరిస్తామంటున్న వెంకట్రావుపల్లె ప్రజలు



వెంకట్రావుపల్లె గ్రామపంచాయతీ కార్యాలయం

7

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలి

- చిన్నబోనాలలో లబ్ధిదారుల ఆందోళన

సిరిసిల్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా అందివ్వాలని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. ఇసుక కొరత ఏర్పడడంతో ట్రాక్టర్ యాజమానులు ఇదే అదనుగా భావించి ఒక ట్రిప్పునకు రూ 6వేలను తీసుకుంటున్నారని, ప్రభుత్వం స్పందించి ఉచితంగా ఇసుకను అందించాలంటూ లబ్ధిదారులు ఆందోళనలు చేపట్టిన సంఘటన ఆదివారం సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో చోటుచేసుకుంది. మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు చిన్నబోనాల గ్రామంలో ఇళ్లు లేనివారికి ఇందిరమ్మ పథకం కింద రూ 5లక్షలతో 26 ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. అయితే సిరిసిల్ల మానేరు వాగునుంచి ఇసుకనుంచి ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని ఆశించిన లబ్ధిదారులకు నిరాశనే మిగిలిపోయింది. ప్రభుత్వం ఉచిత ఇసుకకు అనుమతులు ఇవ్వకపోవడంతో ఇసుకను రావాణా చేసే ట్రాక్టర్ యాజమానులు సిరిసిల్ల మానేరు వాగు నుంచి చిన్నబోనాల గ్రామానికి ఇసుకను తీసుకవస్తే ఒక ట్రిపునకు రూ 6వేలు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఉచితంగా ఇసుకను అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సలేంద్రి దేవయ్య, చలిమెల వెంకన్న, చల్ల శ్రీకాంత్, దువ్వాల లక్ష్మీ, బండారి రవి, పడిగే రాజనర్సు, తమ్మల సుధాకర్, బోనాల ప్రమోద్, సుమన్, బానోతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నబోనాలలో ఆందోళన చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు

18న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

సిరిసిల్ల టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఈనెల 18న జిల్లాస్థాయి సీనియర్, జూనియర్స్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని ఆదివారం అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి ఆగస్టు 3, 4 తేదిలలో హన్మకొండలో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ ప్రతాలు ఒరిజనల్‌తో పాటు జిరాక్స్ పత్రాలతో రావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7301464456 సెల్ నంబరులో సంప్రదించాలని తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

గంభీరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బండారి బాలమల్లుపై బండరాయితో దాడిచేసి, గాయపర్చిన సంఘటనలో అదేగ్రామానికి చెందిన నర్ర మల్లేశం, నర్ర అజయ్, నర్ర యాదవ్వలపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు. బాలమల్లు 35ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయపొలంలోకి ఈ నెల 12న నర్ర మల్లేశం, అతని కొడుకు అజయ్, భార్య యాదవ్వలు వచ్చి తమ పొలం అంటూ దూషిస్తూ దాడి చేశారని ఎస్‌ఐ తెలిపారు. బాలమల్లును నెట్టివేస్తూ ముగ్గురు బండరాయితో దాడిచేయగా తలకు, కుడిచేతికి గాయమైందన్నారు. దాడి సమయంలో అడ్డువెళ్లినబాలమల్లు తండ్రికి, అన్నకుకూడా గాయాలైనట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నర్ర మల్లేశం, అజయ్, యాదవ్వపై కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నట్టు ఎస్‌ఐ వెల్లడించారు.

ఒకరిపై కేసు

మల్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నూకపల్లి డబుల్‌బెడ్‌రూం కాలనీలో ఒకరిపై దాడిచేసిన షేక్ హంజ అలియాస్ అయాన్ అనేవ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. షేక్ రహన్‌ను పాతగొడవల నేపథ్యంలో శనివారం రాత్రి అదేకాలనీకి చెందిన షేక్ హంజ అలియాస్ అయాన్ తనమిత్రులతో కలిసి దాడిచేయగా గాయాలు అయినట్లు ఎస్సై తెలిపారు. దీంతో రహన్‌తల్లి రజీయాబేగం ఫిర్యాదుమేరకు షేక్ హంజ అలియాస్ అయాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పరిషత్ ఎన్నికలపై దృష్టి

- ప్రణాళిక రూపొందిస్తున్న కాంగ్రెస్
- 16న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అద్దంకి దయాకర్ రాక
- ఇందిరా గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా సమావేశం
- డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలకు ఆహ్వానం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

మూడు నెలల్లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపడం అనివార్యం కావడంతో కాంగ్రెస్ పార్టీ ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. స్థానిక సంస్థల్లో పట్టు సాధించడం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులను పెంచుకుని వారి ద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఘన విజయం సాధించాలని ఆ పార్టీ భావిస్తున్నది. గ్రామీణ స్థాయిలో సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల్లో ప్రతినిధులను గెలిపించుకోవడం లక్ష్యంగా ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహరచనలు చేస్తున్నది.

● కమిటీల నియామకానికి చర్యలు

ఇటీవల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉమ్మడి జిల్లాలకు పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలుగా, వారితో కలిసి పనిచేసేందుకు ఇద్దరు, ముగ్గురు చొప్పున ప్రతినిధులుగా పార్టీ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులను, ప్రధాన కార్య దర్శులను ప్రకటించింది. స్థానికంగా ఉండే డీసీసీ అధ్యక్షులతో కలిసి పార్టీ నేతలు సంస్థాగతంగా అన్ని కమిటీల నియామకానికి చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్టం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నేతలను గెలిపించడానికి కార్యాచరణ రూపొందించనున్నారు. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లా పార్టీ ఇన్‌చార్జిగా నియమితులైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయమైన ఇందిరాభవన్‌లో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో ఈ నెల 16న సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆయన ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లను కలిసి జిల్లాలో సంస్థాగత పరిస్థితులపై చర్చించారు. 16న ఉమ్మడి జిల్లా పరిధిలోని డీసీసీ అధ్యక్షులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు, ఆయా స్థానాలకు పోటీ చేసి ఓడిపోయి ఇన్‌చార్జిలుగా ఉన్న నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీసీసీ, డీసీసీ కార్యవర్గ సభ్యులు, ఇతర నాయకులకు ఈ సమావేశానికి హాజరుకావాలని ఆహ్వానాలు పంపించారు. సమావేశంలో ప్రస్తుతం జిల్లాల్లో పార్టీ పరిస్థితిపై చర్చిస్తారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్ని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను గెల్చుకున్నాం, ఇప్పుడు మెజార్టీ స్థానాలను గెలుపొందడానికి ఏం చేయాలి అనే విషయాలపై వారు చర్చించనున్నారని సమాచారం.

● బీసీ రిజర్వేషన్లే ప్రధాన ప్రచార అస్త్రం

ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడానికి ఆర్డినెన్స్ తీసుకురావడాన్ని ప్రధాన ప్రచార అస్త్రంగా మల్చుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలైన రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, రేషన్ కార్డులపై సన్నబియ్యం పంపిణీ అంశాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలనుకుంటున్నారు. నియోజకవర్గానికి 3500 చొప్పున నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రజల్లో ప్రచారంచేసి త్వరలోనే రెండో విడత ఇళ్ల మంజూరు జరుగుతుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని భావిస్తున్నారు. ఈ అంశాలపై ప్రజల్లో ఉన్న అభిప్రాయమేమిటి, మరింత సానుకూలత పెంచడానికి ఏ చర్యలు చేపట్టాలి, వాటిని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి ఏ రకంగా వ్యూహం రూపొందించాలి అన్న విషయమై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి 18 నెలలు కాగా ప్రజల్లో ప్రభుత్వంపట్ల అసంతృప్తి పెరిగిపోయిందని ప్రచారం జరుగుతోంది. దానిని తిప్పికొట్టాలని, ఒకవేళ ఎక్కడైనా అసంతృప్తి ఉంటే కారణాలు తెలుసుకుని సరిచేయాలని భావిస్తున్నారు. కాంగ్రెస్ ముందుగానేస్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరు ఇతర పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది.

ఓసీపీ-3లో ప్రమాదం



ప్రమాదంలో గాయపడ్డ శ్రావణ్

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టులో ఆదివారం జరిగిన ప్రమాదంలో గొట్టె శ్రావణ్ అనేకార్మికుడు గాయపడ్డాడు. బ్రేకులు ఫెయిల్‌అయిన డీజిల్‌బోజర్ మరమ్మతు సమయంలో ప్రమాదం జరిగింది. మిడిల్ షిఫ్టులో జనరల్ మజ్దూర్ అయిన శ్రావణ్ డీజిల్ బోజర్ టైర్ల కింది భాగంలో ఎయిర్‌కనక్షన్ సరిచేస్తుండగా బోజర్ ముందుకు కదిలింది. వాహనం శ్రావణ్ మీద నుంచి కదలడంతో తలకు, పక్కటెముకలకు గాయాలయ్యాయి. అధికారులు హుటాహుటిన శ్రావణ్‌ను స్థానికడిస్పెన్సరీకి తరలించి ప్రథమచికిత్స అనంతరం గోదావరిఖని ఏరియాఆసుపత్రికి తరలించారు. టీబీజీకేఎస్ నాయకులు డిస్పెన్సరీలో శ్రావణ్‌ను పరామర్శించారు. ఇటీవల ఓసీపీ-3లో ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు రక్షణపై దృష్టి సారించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్జీ-2వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ప్రమాదవశాత్తు కిందపడి జీపీ ఉద్యోగి మృతి



సమ్మయ్య(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బల్బు పెట్టేందుకు ప్రయత్నించి గ్రామపంచాయతీ ఉద్యోగిమృతి చెందిన సంఘటన మండలంలోని తారుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపినవివరాల మేరకు అమిదాలసమ్మయ్య(54) గ్రామపంచాయతీలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అంగడి కావడంతో అక్కడే ఉన్న హనుమాన్ గుడిపక్కన ఉన్న కరెంటు పోలుకు విద్యుత్ బల్బుపెట్టేందుకు ప్రయత్నించాడు. ప్రమాదశాత్తు జారిపడటంతో సమ్మయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన ఎండి భరన్ అనేవ్యక్తి డబుల్‌బెడ్‌రూం ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబసభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. శనివారం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేసిన జాబితాలో తన పేరు లేదని ఆవేదన చెంది ఆదివారం గ్రామశివారులో పురుగుల మందు డబ్బాను చూపిస్తూ ఆత్మహత్య చేసుకుంటున్నానని మిత్రులకు వీడియో కాల్ చేశాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు, మిత్రులు అక్కడికి చేరుకుని బుజ్జగించి ఆత్మహత్యాయత్నాన్ని విరమింపజేశారు. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్త కావడంతో ఈ విషయం మండలంలో చర్చనీయంశంగా మారింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మెటపల్లిటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెజ్జరపు నిఖిల్ (26) అనే యువకుడు మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పట్టణంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా నిఖిల్ అనే వ్యక్తి ఎగిరి పడి అటుగా వస్తున్న ట్రాక్టర్ కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు కాగా స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ ఆపకుండా అతివేగంగా వెళ్లి పోయాడని స్థానికులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పొన్నం రవిచంద్రకు హైమా అవార్డు

కరీంనగర్ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌కు చెందిన ఫిలిం క్రిటిక్, కఫిసో అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర హైమా అవార్డు అందుకున్నారు. ఆదివారం రాత్రి భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు రామకృష్ణగౌడ్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు.



హైమా అవార్డు అందుకుంటున్న పొన్నం రవిచంద్ర

మట్టి, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు

- మట్టి తరలిస్తున్న 10 వాహనాలు సీజ్
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి, ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వేములవాడ రూరల్ మండలం కొడుముంజ, అనుపురం గ్రామ పరిసరాల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 10మట్టి తవ్వేయంత్రాలు, మట్టి తరలించే వాహనాలను ఆర్డీవో రాధాబాయి సీజ్ చేశారని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తున్నట్లు బ్యానర్‌తో అక్రమంగా తరలిస్తున్న 4 టిప్పర్‌లు, 2 ట్రాక్టర్‌లు, 2 జేసీబీలు, 2 హిటాచి యంత్రాలను సీజ్‌చేసి వారిపై కేసులు నమోదుచేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమలు తేకుండా మట్టి, ఇసుక రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

శ్రావణ్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలి



ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విలపిస్తున్న శ్రావణ్ కుటుంబ సభ్యులు

కరీంనగర్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కడారి శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు కారకులపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. కరీంనగర్ మహిళా ఠాణా సీఐతోపాటు శ్రావణ్‌కుమార్ భార్య తరఫున బంధువుల వేధింపులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆదివారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చ్యురీ గది ఎదుట ఆందోళన చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకునేవరకు పోస్టుమార్టం నిర్వహించ వద్దని భీష్మించారు. శ్రావణ్‌కుమార్ సోదరి వనజ మీడియాతో మాట్లాడుతూ శ్రావణ్‌కుమార్‌పై అతడి భార్య నీలిమ వరకట్నం వేధింపుల కేసు పెట్టిందని, ఈ క్రమంలో శ్రావణ్‌కుమార్‌ను కరీంనగర్ మహిళా ఠాణా సీఐ బెదిరించాడని ఆరోపించారు. దీంతో ఈనెల7న పురుగుల మందుతాగాడని, ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడని తెలిపారు. శ్రావణ్ కుమార్ తండ్రి ఫిర్యాదుతో చొప్పదండి పోలీసులు కేసు నమోదు చేశారు.

● భార్యాభర్తలం విడాకుల కోసం మ్యూచ్‌వల్‌గా సంతకాలు పెట్టి అంగీకరించిన తరువాత తనపై అక్రమంగా వరకట్నం వేధింపుల కేసు నమోదు చేయడమేమిటని శ్రావణ్‌కుమార్ ఆత్మహత్యకు ముందు ఒక సెల్ఫీవీడియోలో ఆరోపించాడు. తన చావుకు సీఐ, తన భార్య నీలిమతోపాటు ఆమె బంధువులు ప్రవీన్, నవీన్, ప్రసన్నవినోద్, మధు కారణమని పేర్కొన్నాడు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం పరిధిలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్ రెడ్డిప్రకటనలో తెలిపారు. రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన గజ్జెలరమేష్‌పై కేసునమోదు చేసినట్లుపేర్కొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని రాచపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుకతరలిస్తున్న ట్రాక్టర్‌ను పటుకున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ ఆదివారం తెలిపారు. జమ్మికుంట మండలంలోని వావిలాల మానేరుపరివాహక ప్రాంతంనుంచి ఎలాంటి అనుమతులులేకుండా తరలిస్తున్న ఇసుకట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ పేర్కొన్నారు.

ఇసుక క్వారీ వద్ద లారీ డ్రైవర్ల ఘర్షణ

మంథని రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మంథని మండలంలోని అడవి సోమనపల్లి గ్రామంలో గల ఇసుక క్వారీ వద్ద లారీడ్రైవర్ల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఆదివారం స్థానిక, నాన్‌లోకల్ డ్రైవర్ల మధ్య వివాదం నెలకొంది. స్థానికులకు మొదట ప్రాధాన్యమిచ్చి లారీలను లోడ్ చేయాలని డిమాండ్‌చేశారు. అదేవిధంగా నాన్‌లోకల్ సైతం లోడింగ్ చేయాలని ఆందోళన చేయడంతో ఇరుపక్షాల మధ్య వాదనలు పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. లారీడ్రైవర్లు లారీలు నిలిపి ధర్నా నిర్వహించారు. మంథనిఎస్‌ఐ రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని ఇరుపక్షాలను శాంతింపచేశారు. నిర్వాహకులు ప్రస్తుతానికి ఇసుక క్వారీని తాత్కాలికంగా మూసివేశారు.

మేడిపల్లిలో కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య



మల్లిఖార్జున్‌గౌడ్(ఫైల్)

జ్యోతినగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేడిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి సింగం మల్లిఖార్జున్‌గౌడ్(40) అనే సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలానికి ఎన్‌టీపీసీ పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

విద్యుత్ వైరు తగిలి గేదె మృతి

గన్నేరువరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారువెల్ల గ్రామంలో ప్రమాదవశాత్తు ఆదివారం విద్యుత్ ఎల్‌టి లైన్ వైరు తెగిపడి ఓ గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు మాంకాళి కిష్టయ్యకు చెందిన గేదె వాగు సమీపంలోని వ్యవసాయభూమిలో మేత మేస్తుండగా అకస్మాత్తుగా ఎల్‌టి లైన్ వైరు తెగిగేదెపై పడడంతో మృతి చెందిందన్నారు.

గేదె విలువ సుమారు 60వేలు ఉంటుందని విద్యుత్ అధికారులు నష్టంపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరాడు.

నారుమడిని కాపాడుకోవడానికి..

- బిందెలతో నీళ్లు పడుతున్నరైతులు
- మూడు రోజుల క్రితం కాలిన ట్రాన్స్‌ఫార్మర్
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



రంగదామునిపల్లిలో బిందెలతో నారు మడికి నీరు పోస్తున్న మహిళా రైతులు

గొల్లపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం రంగదామునిపల్లి గ్రామంలో మూడు రోజుల క్రితం విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో నారుమడులకు నీరందడం లేదు. అటు వర్షాలు కురవక, ఇటు విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో నారుమడులను కాపాడుకునేందుకు పలువురు రైతులు బిందెలతో నారు మడులకు నీళ్లు పోస్తూ నానాపాట్లు పడుతున్నారు. స్థానిక గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ మూడురోజుల క్రితం కాలిపోయింది. దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారమందించినా మరమ్మతులు చేపట్టలేదు. సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌ద్వారా 25మంది రైతుల వ్యవసాయ భూములకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించాలని బాధితరైతులు కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ మధును వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొడిమ్యాల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చెప్యాల క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చెప్యాల గ్రామానికి చెందిన ఊటుకూరి అభిజిత్ అనే యువకుడు గాయాల పాలైనట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. అభిజిత్ చెప్యాల గ్రామం వైపు నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా ఎదురెదురుగా ద్విచక్ర వాహనం కారు ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108వాహనంలో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్టు పైనుంచిపడి గీత కార్మికునికి గాయాలయ్యాయి. మండలంలోని పెగడపల్లి గ్రామానికిచెందిన గోపగోని రాజమల్లు ఆదివారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని కాళ్లు, చేతులు, తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యంకోసం పెద్దపల్లికి తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా

ఎల్లారెడ్డిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటగ్రామశివారులోని వడ్లవానికుంట సమీపంలో నుంచి మట్టిని తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్ ఆదివారం కట్టపై నుంచి అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించికిందకు దూకేశాడు. దాంతో ప్రమాదం త్రుటిలో తప్పినట్లయింది. మట్టిని రవాణా చేస్తున్న వాహనం అదుపు తప్పి కట్టపై నుంచి ట్రాక్టర్‌ఇంజన్ బోల్తాకొట్టింది. సమాచారం అందుకున్న రైతులు ఎక్స్‌కవేటర్‌తో బోల్తాపడిన ట్రాక్టర్‌ను తొలగించారు.

నట్టల నివారణ మందులేవి?

- రెండేళ్లుగా పంపిణీ చేయని ప్రభుత్వం



కరీంనగర్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గొర్రెలకు, మేకలకు ఏడాదికి నాలుగు సార్లు నట్టల నివారణ మందులను తాగించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి రెండు సార్లు నట్టల నివారణ మందులను పంపిణీ చేపటేది. ఇప్పటికి రెండేళ్లగా పంపిణీ చేయకపోవడంతో గొర్రెల, మేకల పెంపకం దారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వారు తెలుపుతున్నారు. రెండేళ్లగా గొర్రెలకు మేకలకు ప్రభుత్వం నట్టల నివారణ మందుల సరఫరా చేయడం లేదు. సకాలంలో నట్టల నివారణ మందులు తాగించడం వల్ల జీవాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని, బరువు పెరగుతాయని పశువైద్యులు చెబుతున్నారు. బరువు పెరిగిన గొర్రెలు, మేకలను విక్రయిస్తే పెంపకం దారులకు లాభదాయకంగా ఉంటుంది. కరీంనగర్ రూరల్ మండలంలో మొత్తం 4,500 వరకు మేకలు, 35 వేల వరకు గొర్రెలు ఉన్నాయి. గతంలో ప్రతి యేడు రెండు సార్లు ప్రభుత్వమే నట్టల నివారణ మందులను పశు వైద్యశాఖ ద్వారా అందించేది. రెండేళ్లుగా నిలిచిపోయింది. దీంతో గొర్రెలు సరిగా పెరగక, విక్రయాలు సరిగ్గాలేక నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా అందజేయకపోవడంతో సొంత డబ్బుతో నట్టల నివారణ మందు వేయిస్తున్నామని మరి కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈనెలలో పశువులకు రోగాల బారిన పడకుండా మాత్రం టీకాలు వేశామని పశు వైద్యాధికారులు తెలిపారు. ప్రభుత్వం చొరవ తీసుకుని నట్టల నివారణ మందులను అందించాలని గొర్రెల పెంపకం దారులు కోరుతున్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ

నిమ్స్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా, నాగారం ధర్మపురికి చెందిన అరుణ్ కుమార్ (61) తలకు సర్జరీ కోసం జూన్19న నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సకు చేరాడు. అప్పటినుంచి చికిత్స పొందుతున్న అరుణ్ కుమార్ ఆదివారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని సందర్శించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తొందరగా మృతదేహాన్ని వారి సొంతూరుకు పంపాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ శరత్, అదనపుడైరెక్టర్ సర్వేశ్వరరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ ఉన్నారు.

తండ్రీకొడుకుల మధ్య భూవివాదం

- పురుగుల మందు తాగి కొడుకు మృతి

జూలపల్లి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): జూలపల్లి మండలకేంద్రానికి చెందిన గుమ్మడి సతీష్(35) అనేవ్యక్తి భూమి వివాదంలో తీవ్ర మనస్తాపానికి లోనై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.. గుమ్మడి మల్లయ్యకు ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.అందరికీ వివాహాలయ్యాయి. మల్లయ్యకు 30గుంటల వ్యవసాయ భూమి ఉంది. భూమిపంపకం విషయంలో తండ్రి మల్లయ్య, కొడుకు సతీష్ మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో శనివారం తండ్రీకొడుకు మధ్య గొడవ జరగగా మనస్తాపానికి గురైనసతీష్ పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించేక్రమంలోమృతిచెందాడు. సతీష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్న దర్శనం కోసం క్యూలో వెళుతున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి తరలివచ్చిన భక్తులు ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు పార్వతి, రాజరాజేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

రాజన్న సేవలో పరకాల ఎమ్మెల్యే..

వేములవాడ రాజరాజేశ్వర స్వామిని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆదివారం రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఈవో..

దేవదాయ ధర్మదాయశాఖ ఆదేశాలతో వేములవాడ మున్సిపల్ పరిధిలోని గురువయ్యనగర్ సమీపంలో ఆలయఈవో రాధాబాయి వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి సబంధించిన స్థలంలో ఆలయ ఉద్యోగులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తెగని సరిహద్దు వివాదం

- గతంలో సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించిన గొల్లపల్లి ప్రజలు
- సమస్య పరిష్కారం కాకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామంటున్న వెంకట్రావుపల్లె ప్రజలు



ఇల్లంతకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల పునర్విభజనతో రెండు గ్రామాల్లో విభేదాలు పొడచూపాయి. సరిహద్దు విషయంలో ఇరుగ్రామాల మధ్య వివాదం ఏడు సంవత్సరాలు గడిచినా పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికి రావడంతో సరిహద్దు వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. గొల్లపల్లి, వెంకట్రావుపల్లె గ్రామాలు గతంలో 1600జనాభా, 930 ఓటర్లతో ఏకైక గ్రామపంచాయతీగా ఉండేది. ప్రభుత్వం కొత్తగా గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో గొల్లపల్లి గ్రామ పంచాయతీని వెంకట్రావుపల్లె, గొల్లపల్లి గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు. అధికారుల నిర్ణయం వల్ల గొల్లపల్లి గ్రామంలోని ఓటర్లు, భూములను వెంకట్రావుపల్లె గ్రామంలో కలిపారు. దీనిని గొల్లపల్లి గ్రామస్థులు వ్యతిరేకించారు. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతో రెండు గ్రామాల్లో తొలుత ఎన్నికల వాతావరణం నెలకొంది. తమకు జరిగిన నష్టంపై ఏకమైన గొల్లపల్లి గ్రామస్థులు నామినేషన్లు వేయకుండా ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు సర్దిచెప్పడానికి ప్రయత్నించి విఫలం అయ్యారు. దీనితో గొల్లపల్లి గ్రామపంచాయతీకి ప్రత్యేక అధికారి పరిపాలన కొనసాగింది. కొంతకాలానికి ప్రభుత్వం మరోసారి గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చింది. అధికారులు చాకచక్యంగా వ్యవహరించి కొంతమందితో నామినేషన్లు వేయించారు. తిరిగి ఏకమైన గ్రామస్థులు నామినేషన్లు వేసిన వారందరు ఉపసంహరించుకున్నారు. ఐదు సంవత్సరాల పాటు స్థానిక ప్రజాప్రతినిధులు లేకుండా కొనసాగింది. స్పందించిన అధికారులు సరిహద్దు వివాదాన్ని పరిష్కరిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌పై వెంకట్రావుపల్లె గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సమగ్ర సర్వే జరుపగా వెంకట్రావుపల్లె గ్రామస్థులు బహిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారుల ఒత్తిడిల మేరకు రెండవసారి సర్వేలో పాల్గొన్నారు.



మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న వెంకట్రావుపల్లె గ్రామస్తులు

తమ గ్రామానికి చెందిన బస్టాండ్, పాలకేంద్రం, పోచమ్మ, పాఠశాలతో పాటు 30ఇళ్ళు, వ్యవసాయ భూములను గొల్లపల్లి గ్రామపంచాయతీలో కలిపారని పేర్కొంటున్నారు. సమస్య పరిష్కరించాలని విన్నవించినట్లు తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అయితేనే ఎన్నికల్లో పాల్గొంటామని, లేనట్లయితే ఎన్నికల బహిష్కరిస్తామని పేర్కొంటున్నారు. గొల్లపల్లి గ్రామస్థులు మాత్రం ఎన్నికల్లో పాల్గొంటామంటున్నారు. సమస్యలు ఉన్నట్లయితే పరిష్కరించుకోవాలి తప్ప ఎన్నికలకు దూరంగా ఉండటం సరైన విధానం కాదని అధికారులు పేర్కొంటున్నారు.

సర్పంచ్ ఎన్నికలలో పాల్గొంటాం..

- ఒరుపుల రాములుయాదవ్, గొల్లపల్లి



రాబోవు సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలలో గ్రామస్థులం పాల్గొంటాం. గతంలో మా గ్రామానికి చెందిన ఓటర్లను వెంకట్రావుపల్లె గ్రామంలో కలపడం వల్ల ఎన్నికలను బహిష్కరించాం. అధికారులు ఎంత ఒత్తిడి చేసినా గ్రామస్తులందరం ఒకే మాటకు కట్టుబడి ఉన్నాం. గ్రామపంచాయతీకి పాలకవర్గం లేకపోవడం వల్ల అన్ని రంగాలలో వెనుకబడిపోయాం. ప్రత్యేకాధికారి ఉన్నప్పటికిని ప్రజలకు మేలు జరగలేదు. మా గ్రామానికి దక్కవలసిన ప్రాధాన్యం ప్రస్తుతం లభించింది.

సమస్యలు పరిష్కరిస్తేనే ఎన్నికల్లో పాల్గొంటాం

- అనగోని యాదగిరిగౌడ్, వెంకట్రావుపల్లె



అధికారులు రెండవసారి ఇచ్చిన సరిహద్దు నోటిఫికేషన్ ఏకపక్షంగా ఇచ్చారు. దీని ద్వారా వెంకట్రావుపల్లెకు చెందిన బస్టాండ్, పోచమ్మ ఆలయం, పాలకేంద్రంతో పాటు దసరా పండుగ రోజు జరుపుకునే జంబి ప్రాంతం కూడా పోతుంది. సమస్యలు పరిష్కరించాలని సమగ్ర సర్వేను బహిష్కరించాం. నాయకులు, అధికారుల హామీతో రెండవసారి సర్వేలో పాల్గొన్నాం. మా గ్రామానికి రావలసిన ప్రాంతాలు రాకపోతే ఎన్నికలకు బహిష్కరించడానికి ఏమాత్రం వెనుకడుగు వేయం.

ఇరుగ్రామాల మధ్య సమన్వయం కుదర్చాలి

- మంద సుశీల, గొల్లపల్లి మాజీ సర్పంచ్



అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోకుండా రెండు గ్రామాల ప్రజల మధ్య సమన్వయం కుదర్చాలి. ప్రస్తుత నిర్ణయం వెంకట్రావుపల్లె గ్రామస్థులకు ఇబ్బందిగా మారింది. ఉమ్మడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అన్నదమ్ములుగా కలిసి ఉన్నాం. ఎమ్మెల్యే, జిల్లాస్థాయి అధికారులు ఇప్పటికైనా స్పందిస్తే బాగుంటుంది. ప్రజల మనోభావాలను ప్రతి ఒక్కరు గౌరవించాలి. సరిహద్దు సమస్య పరిష్కారం అయితే ఇరుగ్రామాల ప్రజలు సంతోషంగా ఉంటారు.

'కోట' మృతితో కలత చెందిన కళాకారులు

- ఉమ్మడి జిల్లాతో కోట శ్రీనివాస్‌కు అనుబంధం



కోట శ్రీనివాసరావు 75వ జన్మదినం సందర్భంగా కళాభారతిలో ఘన సన్మానం(ఫైల్)

కరీంనగర్ కల్చరల్/సిరిసిల్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాస్ మరణ వార్త ఉమ్మడిజిల్లాలోని ఆయన అభిమానులు, కళాకారులను కలిచివేసింది. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కరీంనగర్‌లో మన సమైక్యత కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతిలో జూలై 11, 2018లో కోట శ్రీనివాస్ 75వ జన్మదిన వేడుకలను సంస్థ అధ్యక్షుడు రొడ్డ యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంస్థ వారి 'బాపూ చెప్పిన మాట' సాంఘిక నాటికను తిలకించిన ఆయన నటీనటులను అభినందించారు. కార్యక్రమానికి ఆయన సోదరుడు కోట శంకర్‌రావుతోపాటు నటుడు బాబూమోహన్ పాల్గొన్నారు. 2009శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారానికి వచ్చారు. వేములవాడ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, సిరిసిల్ల నియోజకవర్గంలో పోటీచేసిన డాక్టర్ చంద్రశేఖర్‌రావు గెలుపు కోసం రోడ్‌షోలు, ఎన్నికల సభల్లో పాల్గొని ప్రసంగించారు. ఆయన మృతిపై రొడ్డ యాదగిరి, కృపాదానం, విగోపాల్‌రావు, కనకం రమణయ్య, మాడిశెట్టి గోపాల్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ధర్మపురి క్షేత్రంలో ఘనంగా గోపాల కాలువలు

ధర్మపురి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని ధర్మపురి క్షేత్రంలోని నర్మదేశ్వర స్వామి గద్దె ఆధ్వర్యంలో గోపాల కాలువలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గోదావరి నది నుంచి తీసుకు వచ్చిన జలాలతో నర్మదేశ్వర స్వామి ఆలయంలో వేదపండితులు ఒజ్జల వికాస్, విలాస్, గుడ్ల నరహరి, రమేష్, సురేష్, రాపాక లక్ష్మికాంతం, కశొజ్జుల సుధాకర్, ఒజ్జలకృష్ణమూర్తి, దేవిప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివుడికి అన్నపూజ అనంతరం ఊరేగింపుగా గోదావరి నదికి బయలు దేరారు. దారి పొడవునా మహిళలు బిందెలతో నీరు తీసుకువచ్చి బ్రాహ్మణులపైపోసి వేడుకలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఒజ్జల వికాస్, విలాస్, గుడ్ల నరహరి, రాపాక లక్ష్మికాంతం, ఒజ్జల దేవిప్రసాద్, కశొజ్జుల సుధాకర్, ఒజ్జల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో గోపాల కాలువలు నిర్వహిస్తున్న అర్చకులు

కక్షిదారుల వద్దకు న్యాయవ్యవస్థ

- పెండింగ్ కేసుల పరిష్కారానికి సమష్టి కృషి అవసరం
- హైకోర్టు జడ్జి జస్టిస్ కె లక్ష్మణ్



ఓదెల కోర్టు ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ లక్ష్మణ్

ఓదెల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : న్యాయవ్యవస్థ పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే దిశగా ప్రజలు, కక్షిదారుల వద్దకు న్యాయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని హైకోర్టు జడ్జి, పెద్దపల్లి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఓదెలలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఆయన ప్రారంభించారు. ముందుగా ఇక్కడికి చేరుకున్న హైకోర్టు జడ్జిలు జస్టిస్ లక్ష్మణ్, ఎన్.వి. శ్రావణ్‌కుమార్, ఈ.వి.వేణుగోపాల్, పుల్ల కార్తీక్, శ్రీనివాసరావు లకు కలెక్టర్ కోయ శ్రీహర్ష, సీపీ అంబర్ కిషోర్ ఝూ పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన కోర్టు ప్రారంభోత్సవ సభలో హైకోర్టు జడ్జి లక్ష్మణ్ మాట్లాడుతూ కక్షిదారుల వద్దకు సత్వర న్యాయం అందేందుకు అదనంగా సివిల్ కోర్టులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఇక్కడి జూనియర్ సివిల్ కోర్టు ఏర్పడడం ప్రజలకు, కక్షిదారులకు ప్రయోజనకరమన్నారు. దీంతో అన్ని వర్గాలకు న్యాయం అందే అవకాశాలు మెరుగుపడుతాయని, న్యాయవ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని తెలిపారు. హైకోర్టులో 2.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, సుప్రీంకోర్టులో 82 వేల కేసులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కోర్టులు ప్రారంభించుకున్నంత మాత్రాన పెండింగ్ కేసులు పరిష్కారం కావని, జడ్జిలు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు సమిష్టిగా పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. న్యాయవ్యవస్థలో కూడా మార్పు అవసరమని 30 శాతం మహిళా న్యాయవాదులు ఉండాలన్నారు. జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీశైలం తర్వాత చోళుల వంశానికి చెందిన ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని తెలిపారు. అలాంటి గ్రామంలో కోర్టును ప్రారంభించుకున్నామని, గురుతరమైన బాధ్యత జడ్జిలపై, న్యాయవాదులపై ఉందన్నారు. కక్షిదారులకు న్యాయం అందించేందుకు వృత్తి ధర్మాన్ని పాటించాలని, దీంతో సమాజంలో విలువలు పెరుగుతాయన్నారు. జిల్లా జడ్జి కుంచాల సునీత మాట్లాడుతూ, ప్రతి పౌరునికి న్యాయం ప్రాథమిక హక్కు అని, అందుబాటులో ఉండేందుకు కోర్టును ప్రారంభించామన్నారు. అలాగే కోర్టులో 1226 కేసులు పెండింగ్‌లో ఉంటే ఇందులో 419 సివిల్, 807 క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపారు. ఇక్కడి కోర్టుకు కక్షిదారుడు రావడానికి అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయని, బస్సులు, రైళ్ల సౌకర్యం దగ్గరలో రోడ్ల సౌకర్యాలు న్నాయని, అందరికీ అనుకూలమైన కోర్టును ప్రారంభించుకొన్నామన్నారు. సుల్తానాబాద్ కోర్టులో కేసులు అధికంగా ఉండడం వల్ల ఓదెలలో కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైకోర్టు జడ్జిలను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. మెజిస్ట్రేట్ ధీరజ్ కుమార్, డీసీపీ కరుణాకర్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐలు దీ కొండ రమేష్, వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల తిరుపతిరెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.

నాంపల్లి గుట్టను సందర్శించిన ఈవో రాధాబాయి

- కాంట్రాక్టర్ల తీరుపై ఆగ్రహం, అధిక ధరలపై ఆరా
- ఈవో గుట్టపైకి వస్తున్నట్లు ముందే సమాచారం
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



నాంపల్లి గుట్టపైన కాళీయమర్థనంలో కొబ్బరికాయలను పరిశీలిస్తున్న ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి గుట్టను ఈవో రాధాబాయి ఆదివారం సందర్శించారు. ఈనెల 11వ తేది శుక్రవారం 'లక్ష్మీనృసింహస్వామి భక్తుల నిలువు దోపిడి' పేరుతో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు నాంపల్లి గుట్టపైకి వచ్చిన ఈవో ముందుగా నాంపల్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ఈవోకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం గావించారు. అనంతరం ఆలయ గోపురం వద్దగల పరిసరాలను పరిశీలించారు. సమీపంలో కనిపించిన చెత్తను తొలగించాలని సిబ్బందికి సూచించారు. గుట్టపైన, మధ్యభాగంలోని, కాళీయ మర్థనంలోని టెంకాయల విక్రయదారులను ఎంత ధరకు విక్రయిస్తున్నారని అడిగారు. కాళీయమర్థనంలో పాలు, నూనె, దీపాల ధరలను తెలుసుకున్నారు. టెంకాయలను ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారో భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులను ఇబ్బందులకు గురిచేయవద్దని, భక్తులతో కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా మెదలాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాంపల్లి గుట్టపైకి వచ్చే భక్తులకు కొబ్బరికాయలు, పాలు, నూనే, దీపాల ధరలు తెలిసేలా ధరలు, పరిమాణంతో సహ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌లు, సంబంధిత అధికారులను ఆదేశించారు.

విలువలతో కూడిన విద్య సోషలిజం ద్వారానే సాధ్యం



పీడీఎస్‌యూ సదస్సులో మాట్లాడుతున్న అఖిలభారత విద్యా పరిరక్షణ కమిటీ

భగత్‌నగర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక స్పృహ, విలువలతో కూడిన విద్య కేవలం సోషలిజం ద్వారానే సాధ్యమని అఖిలభారత విద్యా పరిరక్షణ కమిటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ పట్నాయక్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణతరగతుల్లో ఆదివారం మాట్లాడారు. విద్యార్థులు, యువత సోషలిస్టు సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాలు అశాస్త్రీయ విద్యను అందిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వ మతోన్మాద ఫాసిస్టుచర్యలను ప్రగతిశీల శక్తులు ఐక్యఉద్యమాల ద్వారా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్రమాజీ నాయకుడు కొత్తపల్లి రవి, మాజీ రాష్ట్రఅధ్యక్షుడు ఆవుల అశోక్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటీ పృథ్వీ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనిల్ సాయిబోలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, నరేందర్, భాస్కర్, ఎర్ర అఖిల్ కుమార్, సహాయ కార్యదర్శులు సాయి, కర్క గణేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓదెల మల్లన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఓదెల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచి గణపతిపూజ, పుణ్యాహవాచనం, మంటప స్థాపన, వీరభద్ర ఆరాధన తోపాటు పలు పూజలు నిర్వహించారు. అలాగే భద్రకాళి ఆవాహన రాత్రి పది గంటల నుంచి ప్రారంభమై తెల్లవారుఝాము వరకు కొనసాగుతుంది. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. శివసత్తులు, జోగినిల నృత్యాలతో స్వామి వారికి బోనాలను సమర్పించారు. పెద్దపట్నం నిర్వహించిన అనంతరం సోమవారం తెల్లవారుఝామున అగ్నిగుండాల మహోత్సవాన్ని నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులకు ఎలాంటి ఆటంకాలు జరుగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈ ఓ సదయ్య తెలిపారు.



స్వామివారిని అలంకరిస్తున్న అర్చకులు

నిరుపయోగంగా సింగరేణి క్రీడామైదానం

- డంప్‌యార్డ్‌గా మారుతున్న ఖని అంబేద్కర్ క్రీడాప్రాంగణం

కోల్‌సిటీటౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడామైదానం నిరుపయోగంగా మారింది. పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తాచెదారంతో డంప్‌యార్డ్‌ను తలపిస్తున్నది. దీంతో క్రీడాకారులకు, వాకర్స్‌కు ఉపయోగకరంగా లేకుండా పోయింది. మైదానం అధ్వానంగా మారడంతో స్థానికకార్మికులు, కార్మిక కుటుంబాలు, క్రీడాకారులు దూరంగాఉన్న మైదానాలకు వెళ్ళాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. సింగరేణిసంస్థ పవర్‌హౌస్ కాలనీలోని కార్మిక, కార్మికకుటుంబాల కోసం మూడు దశాబ్ధాల క్రితం ఏర్పాటుచేసిన ఈ మినీ క్రీడామైదానం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. పలుమార్లు విజ్ఞప్తుల మేరకు సింగరేణిసంస్థ ప్రహరీ ఏర్పాటు చేసి అభివృద్ధిచేసింది. డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ క్రీడామైదానంగా నామకరణం చేసింది. దీంతో కార్మికులు, కార్మిక కుటుంబాలు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడింది. అయితే కొన్నేళ్ళుగా క్రీడామైదానం నిరాదరణకు గురికావడంతో అధ్వానంగా మారింది. మైదానానికి ఉన్న మెయిన్‌గేటు పనిచేయడం లేదు. అలాగే శివాలయం వైపు ఉన్న గేటు కింద పూర్తిగా దెబ్బతింది.

బాడ్మింటన్ క్రీడాకారుల శిక్షణ

బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులు ఈ మైదానంలోనే శిక్షణ తీసుకునేవారు. ఇక్కడి క్రీడాకారులు జిల్లా,రాష్ట్ర,జాతీయస్థాయిలో బాల్ బాడ్మింటన్ క్రీడాకారులుగా రాణించారు. ఇప్పటికి బాడ్మింటన్ శిక్షణ తీసుకుంటున్నారు. మైదానంలో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చి ఫ్లడ్‌లైట్లు, ఇతరసౌకర్యాలు కల్పిస్తే క్రీడాకారులుగా రాణించే అవకాశం ఉంటుందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. వర్షంపడితే చెరువుగా మారుతుందని చెబుతున్నారు.



ఖని పవర్‌హౌస్‌కాలనీలోని క్రీడామైదానం



క్రీడా మైదానం ముందు వేసిన చెత్తాచెదారం

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

పాలపాటి వినోద్, బాల్‌బాడ్మింటన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ



క్రీడా మైదానంలో ఎంతో మంది బాల్‌బాడ్మింటన్ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడంతో పాటు జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారు. ప్రస్తుతం క్రీడాప్రాంగణం అధ్వానంగా ఉండంతో ఇబ్బందిపడాల్సి వస్తున్నది. ఫ్లడ్‌లైట్లు, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే రాత్రి వేళల్లో కూడా శిక్షణకు అనుగుణంగా ఉంటుంది. వర్షం పడితే చెరువుగా మారుతున్నది. క్రీడా మైదానంలో వాకింగ్ అనుకూలంగా ఉండేలా ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

కలుపు కష్టాలు..

(5వ పేజీ తరువాయి)

వరి నాట్లు వేగం అందుకోవడం లేదు. వరినాట్ల కోసం ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు రావడంతో ఊపందుకున్నాయి. జిల్లాకు బీహార్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, రాష్ట్రాల నుంచి వలస వచ్చారు. ఎకరానికి రూ 6వేల నుంచి రూ 7వేల వరకు తీసుకుం టున్నారు. పత్తి, మొక్కజొన్న చేన్లలో స్థానిక కూలీలు రూ.450 నుంచి రూ 500 వరకు కూలి తీసుకుంటున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలంలో 2,43,773 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. వరి సాగు లక్షా 84 వేల 860 ఎకరాలు, మొక్కజొన్న 1600 ఎకరాలు, పత్తి 49,760 ఎకరాలు, కందులు 1,155 ఎకరాలు, పెసర 79 ఎకరాలు, ఇతర పంటలు 6,304 ఎకరాలు, ఇతర పంటలు 6,900 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనాలు వేశారు. ఇందులో 37,440 ఎకరాలకు నాట్లు పడ్డాయి. ఇప్పటి వరకు జిల్లాలో 79,718 వేల ఎకరాల్లో నాట్లు వివిధ పంటలు రైతుల వేసుకున్నారు.

చెడిపోయిన బోరు మోటార్

- ఎన్గల్‌లో తాగునీటి కోసం గ్రామస్థుల ఇబ్బందులు



బోరు వద్ద నీళ్లు తీసుకొని వెళ్తున్న గ్రామస్థులు

చందుర్తి జూలై 13 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. గ్రామంలోని పూసర్ల కాలనీలోని రక్షిత మంచినీటి బావి మోటార్ పది రోజుల క్రితం చెడిపోయిందని గ్రామస్థులు తెలిపారు. దీంతో గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా నెలకొందన్నారు. రక్షిత మంచినీటి బావి మోటారుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలనీ ప్రజలు తంటాలు పడుతున్నారు. కాలనీలో ఉన్న చేతిపంపుల వద్ద నీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి బావి మోటారుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కంచె నుంచి వెళ్లిపోయిన గొర్రెల మంద..

- రక్షించి యజమానికి అప్పగించిన పోలీసులు



గొర్రెల మందను యజమానికి అప్పగిస్తున్న పోలీసులు

రుద్రంగి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల మంద కంచె నుంచి వెళ్లిపోయి కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై అర్ధరాత్రి వెళుతుండడంతో గమనించిన పోలీసులు రక్షణ కల్పించి యజమానికి అప్పగించిన సంఘటన మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన గెంటె మల్లయ్య అనే గొర్రెల యజమాని తన గొర్లను రోజు మాదిరిగానే అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లి సాయంత్రం మందను కంచెలోకి తోలి ఇంటికి వెళ్లాడు. కంచె నుంచి బయటకు వెళ్లిన గొర్రెలు అర్ధరాత్రి మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై తిరుగుతుండగా పెట్రోలింగ్ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది గమనించారు. గొర్ల మందకు నూతన కూరగాయల మార్కెట్‌లో రక్షణ కల్పించారు.అనంతనం మంద యజమాని కోసం వాకబు చేసి అప్పగించారు. మంద విలువ రూ.5లక్షలకు పైగా ఉంటుందని పేర్కొన్నారు.

గుంతలమయం.. ప్రయాణ ప్రాంగణం..

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ప్రయాణ ప్రాంగణంలో ఏర్పడిన గుంతలు

ఎల్లారెడ్డిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రయాణ ప్రాంగణం అధికారుల నిర్లక్ష్యం వల్ల గుంతలమయంగా మారింది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. లోనికి ప్రవేశించిన బస్సు కింది భాగం నేలను తగులుతోంది. దాంతో డ్రైవర్లు బస్సులను ప్రాంగణం బయటే నిలుపుతున్నారు. బస్టాండు నిర్వహణ కరవైంది. ప్రయాణ ప్రాంగణం వెనుక స్థలంలో ఏపుగా చెట్లు పెరగడంతో చీకటిపూట ప్రయాణీకులు భయంభయంగా బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ లేక కంపు కొడుతున్నాయి. పందుల విహారం, దుర్గంధంతో ప్రయాణీకులు సహవాసం చేస్తున్నారు. రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుంతలను పూడ్చడంతో పాటు ప్రాంగణంలోని సమస్యలు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారులు రక్తసిక్తం..

- చౌరస్తాలు, మూలమలుపులు వద్ద ప్రమాదాలు - ప్రమాద సూచికలు పాటించని వాహనచోదకులు

- ప్రాణాలు తీస్తున్న అతివేగం, మద్యం - ఏటా పెరుగుతున్న మృతుల సంఖ్య



సిరిసిల్ల క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. రహదారులలోని చౌరస్తాలు, మలుపులు ప్రమాదాలకు నెలవయ్యాయి. రహదారులపై ఏర్పరిచినా ప్రమాద సూచికలను వాహనచోదకులు పాటించడంలేదు. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారినపడుతున్నారు. ప్రధానంగా మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపడమే కాకుండా అతివేగం ప్రాణాలు తీస్తున్నాయి. జిల్లాలో ఏటేటా మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 2024లో దాదాపు 288, గత 6నెలల్లో 131 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 125మందికి పైగా మృతిచెందగా 450 మందికి తీవ్రగాయాలై కాళ్లు, చేతులు విరిగిపోయాయి.

డేంజర్ జోన్‌లుగా..

జిల్లాలోని పలు రహదారులు డేంజర్ జోన్లుగా మారాయి. ప్రధానంగా సిరిసిల్ల నుంచి వేములవాడ, కరీంనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇదేవిధంగా ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్లకు వచ్చే రహదారి మధ్యలో పెద్దూరు వద్ద వారానికి ఒక ప్రమాదం జరుగుతుంది. మరోవైపు సిరిసిల్ల నుంచి తంగళ్లపల్లి, జిల్లెల్ల వెళ్లే రహదారిపైనా ఇదే పరిస్థితి నెలకొంది. సిరిసిల్ల రెండవ బైపాస్ రహదారి అయిన రగుడు, చంద్రంపేట, వెంకటాపూర్ చౌరస్తాలు డేంజర్ జోన్లుగా మారాయి.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల కాలంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. ప్రధానంగా సిరిసిల్ల రెండవ బైపాస్ రహదారిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో కారు, ద్విచక్ర వాహనాలు ఢీకొని వేర్వేరుగా ముగ్గురు యువకులు మృతిచెందారు. సిరిసిల్ల నుంచి అగ్రహారం, ఆరెపల్లి మీదుగా కరీంనగర్ వెళ్లే రహదారిలో మద్యం మత్తులో అతివేగంగా నడుపుతున్న కారు వేర్వేరుగా ద్విచక్రవాహనాలకు ఢీకొని ఇద్దరు యువకులు మృతిచెందారు. అగ్రహారం వద్ద ద్విచక్రవాహనంపై అతివేగంగా వెళుతున్న యువకుడు డివైడర్‌కు ఢీకొని ప్రాణాలు విడిచాడు. సిరిసిల్ల నుంచి తంగళ్లపల్లి వెళ్లే రహదారిలో మానేరు వంతెనపై కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. సిరిసిల్ల రెండవ బైపాస్ చివరలో గల వెంకటాపూర్ వద్ద అతివేగంగా వెలుతున్న కారు అదుపు తప్పి ఓ ఇంటిలోకి దూసుకెళ్లింది. ఈ సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ విధంగా ప్రమాదాలు చోటుచేసుకోవడంతో రహదారులు రక్తసిక్తమవుతున్నాయి.

ప్రమాదాలకు నెలవు చౌరస్తాలు, మలుపులు

జిల్లాలో పలు ప్రాంతాలు ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఇటీవల వాహనాలు ఢీకొని ప్రమాదాలు ఎక్కువగా సంభవించాయి. జిల్లాలోని వేములవాడ నుంచి సిరిసిల్ల రహదారిలోని రగుడు చౌరస్తా, చంద్రంపేట చౌరస్తా, తంగళ్లపల్లి వైపు వెళ్లే మానేరువంతెన చౌరస్తా, సిరిసిల్ల పట్టణంలోని కార్గిల్‌లేక్, అంబేద్కర్‌చౌరస్తా, మున్సిపల్ కార్యాలయం, నేతన్న విగ్రహం, వెంకంపేట రోడ్డు, సిరిసిల్ల, కామారెడ్డి రోడ్డు, కొత్తచెరువు, పద్మనాయక కల్యాణ మండపం, ఆర్టీవో కార్యాలయం వద్ద మలుపులు, చౌరస్తాలు ప్రమాదాలకు నెలవులు అయ్యాయి. ప్రధానంగా రెండవ బైపాస్ రహదారిలో ఒక వైపు డివైడర్‌లు అమర్చి రోడ్డు మూసివేయడంతో ఒకేవైపు వాహనాలు వెళ్లేందుకు వీలు కల్పించడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇటీవల బైపాస్ రోడ్డులో వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృతిచెందారు. ఈ ప్రమాదాల్లో వాహనాలు అతివేగంగా వచ్చి డివైడర్‌లకు ఢీకొన్న సంఘటనలే ఉన్నాయి. రగుడు చౌరస్తాలో ఓ ద్విచక్రవాహనదారుడు అతివేగంగా వచ్చి కల్వర్టు కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. డివైడర్‌లపైకి లారీలు, కార్లు ఎక్కి ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

ప్రమాద నివారణ చర్యలు..

సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రహదారులు, ప్రధాన చౌరస్తాల్లో రోడ్లపై ఇటీవల ప్రమాదాలు పెరగడంతో పోలీసులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. అయినప్పటికీ రోడ్డుపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాదాల నివారణపై పోలీసులు చర్యలు తీసుకోవాలి. డివైడర్ వద్ద ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రహదారుల మధ్యలో ఉన్న డివైడర్‌ల వద్ద సూచిక బోర్డులు ఏర్పరచాలి. ప్రమదాలపై పోలీసులు చెక్ పెట్టాలి. ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పరచాలి. పట్టణంలో ఏ వాహనమైనా 20 కిలోమీటర్ల వేగం కంటే ఎక్కువగా వెళ్లవద్దని సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా సిరిసిల్ల పట్టణ శివారులోని కొత్తచెరువు, కార్గిల్ లేక్, పద్మనాయక కల్యాణమండపం, రగుడు చౌరస్తా, పెద్దూరు, రెండవ బైపాస్ రహదారి తదితర ప్రాంతాల్లో వీలైనన్ని సూచిక బోర్డులు ఏర్పరిస్తే ప్రమాదాలు నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి..

- మహేశ్ బి. గీతే, ఎస్పీ

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు. అతివేగంను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాం. ప్రధాన రహదారుల మధ్యలో ఉండే డివైడర్‌లు ప్రారంభం, ముగింపు ప్రాంతాల్లో ప్రమాదాల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాము. రాత్రి వేళల్లోనూ కనిపించే విధంగా స్టిక్కర్లు అమర్చాము. ప్రధానంగా మద్యం మత్తులో వాహనాలు నడిపితేచర్యలు తప్పవు. అతివేగంగా వెళ్లవద్దు. పట్టణంలో ఎలాంటి భారీ వాహనాలైనా 20 కిలోమీటర్ల వేగంగాకంటే ఎక్కువగా వెళ్లకుండా చూసుకోవాలి. అన్ని వర్గాల వారు సహకరించి ప్రమాదాలను తగ్గించాలి.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



కోనరావుపేటలో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు



గంభీరావుపేటలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

కోనరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో బీసీ వర్గాలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి సంతోషం వ్యక్తం చేస్తూ టపాసులు పేల్చి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బీసీల కోసం తనవంతు కృషి చేయడం వల్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీలకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఏఎంసీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, చందనగిరి గోపాల్, చేపూరి గంగాధర్, బుర్ర రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంగలి వెంకన్న, లింబయ్య, వాల్యా నాయక్, సాసాల మల్లారెడ్డి, నాగరాజు, సింగం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికారప్రతినిధి పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, ప్రధానకార్యదర్శి రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ భూమరాజం, నాయకులు బంగ్ల రాజు, ప్రభాకర్, మల్లయ్య, బాలయ్య, ప్రవీన్, రాజశేఖర్, లింగం తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

ఇల్లంతకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని జిల్లా ప్రధానకార్యదర్శి మీసం లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం మధ్యాహ్నబోజన కార్మికుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నిర్వాహకులకు 8నెలలుగా కోడిగుడ్ల డబ్బులు రావలసి ఉందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా పాఠశాలలో ఉపాధ్యాయులు మాత్రం రోజు రెండు రకాలు కూరలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇచ్చే చార్జీలను ఒక్కొక్కరికి రూ 30ఇవ్వాలని లేనట్లయితే వచ్చేనెల 10నుండి సమ్మెకు వెలుతామన్నారు. మధ్యాహ్నబోజన కార్మికులకు నెలకు రూ 600 ఇస్తున్నారని వీటి ద్వారా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో పాలకులకే తెలియాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హమీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధ్యక్షుడు రాజు, మధ్యాహ్నబోజన కార్మికులు సంతోష, బాలమణి, మల్లవ్వ, బాలవ్వ, వరలక్ష్మీ, పోచవ్వ, లక్ష్మీ, నర్సవ్వ, రేణుక, సుగుణ, సుశీల, ముత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ఆధ్యాత్మిక శోభ..

- పల్లిమక్తలో భక్తి గీతాలతో గ్రామస్థులకు మేలుకొలుపు



ఆలయంలో ఏర్పాటు చేసిన మైక్‌సెట్ పరికరాలు

కోనరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : తెల్లవారుజామున ఆ గ్రామంలో భక్తి గీతాలతో ఆధ్యాత్మిక శోభ అలుముకుంటోంది. కోడి కోతకు బదులు ఉదయం నాలుగు గంటలకు భక్తిపాటలతో ఆ గ్రామ ప్రజలు నిద్రలేస్తారు. కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో ప్రతీ రోజు తెల్లవారుజామున భగవద్గీత శ్లోకాలతో గ్రామస్థులు నిద్ర లేస్తారు. కోడి కూతకు ముందే భక్తి గీతాలు గ్రామస్థుల్లో ఆధ్యాత్మిక భావాన్ని నింపుతున్నాయి. రాత్రి కూడా భగవద్గీత విని నిద్రలోకి జారుకోవడం పల్లిమక్త గ్రామంలో దైనందిన కార్యక్రమంగా కొనసాగుతోంది. దీంతో గ్రామస్థులు భక్తిభావంతో తన్మయత్వం పొందుతున్నారు. సంవత్సరం క్రితం గ్రామస్థుల సహకారంతో హనుమాన్ ఆలయంలో గ్రామ ప్రముఖుల సహాయంతో మైక్ సెట్ పరికరాలు అమర్చారు. దీంతో ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు గంటకోసారి ఊరంతా భక్తిగీతాలు మైమరిపిస్తున్నాయి. మైక్ సెట్‌లో ప్రతీ రోజు ఉదయం ఐదు గంటలకు సమయం, వారం పేర్కొంటూ ఆ రోజు ప్రాశస్త్యం తెలిపే భక్తిగీతాలు వస్తుంటాయి. దీంతో గ్రామస్థులు భక్తిభావంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పల్లిమక్త గ్రామంలోని హనుమాన్ దేవాలయం

భక్తి గీతాలతో మేల్కొంటున్నాం..

- భారతి, పల్లిమక్త



భక్తిగీతాలు రాగానే ఊరంతా మేల్కొంటుంది. మైకులో భగవద్గీత శ్లోకాలు మొదలవగానే మేల్కొని పనులు ప్రారంభిస్తున్నాం. గంటకోసారి భక్తిగీతాలు రావడంతో గ్రామంలోని ప్రతీ ఒక్కరిలో ఆధ్యాత్మిక భావం నెలకొంటోంది. భక్తి గీతాలతో పాటు సమ యం సులువుగా తెలుస్తోంది. గ్రామస్థులమంతా మైకుల ద్వారా భగవ ద్గీత గురించి పూర్తిగా తెలుసుకుంటున్నాం.

పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

సిరిసిల్ల టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడదల చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం కార్యాలయంలో పద్మశాలి సంఘం, పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మామిడాల భూపతి సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27న పద్మశాలి సంఘం ఎన్నికలు ఉంటాయని అన్నారు. ఓటర్ లిస్టు పద్మశాల సంఘం కార్యాలయంలో అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మండల సత్యం, ఉపాధ్యక్షులు మోర రవి, బాలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి ఎల్లె ఎల్లప్ప నాయకులు పాల్గొన్నారు.

జేఏసీ కమిటీ ఎన్నిక

సిరిసిల్ల టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కారోబార్ ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ కమిటీని ఆదివారం సిరిసిల్లలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా న్యాత నర్సయ్య, ఉపాధ్యక్షులుగా మంగని రాజు, దోమకొండ కిరణ్, ప్రధాన కార్యదర్శిగా నేరోజు వెంకటరమణ, కోశాధికారిగా గంధం ప్రదీప్, సహాయకార్యదర్శులుగా గౌడ రాజమహేందర్, కే భూపాల్, కార్యనిర్వా హక కార్యదర్శిగా ఎస్ శ్రీనివాస్, కార్యవర్గసభ్యులుగా ఏనుగుల వేణుగోపాల్‌రావు, దుర్మటి లచ్చిరెడ్డి, జక్కుల మహేందర్, కత్తి బాలయ్యఅక్కల అంజయ్య, ఇస్మాక్‌లను ఎన్నుకున్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక మొక్కులు

ఎల్లారెడ్డిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లోని వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి పాడిపంటలు, పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ శివారులో సామూహిక వన భోజనాలకు తరలివెళ్లారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పెద్దలింగాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్ కుమార్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఉపాధిహామీ నిధుల నుంచి మండలానికి 1.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. అన్ని గ్రామాలలో ప్రజలు ఇబ్బందులు పడవద్దని వాడవాడలా సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు అమ్ముల అశోక్‌యాదవ్, పయ్యావుల బాలయ్య, కోలనూరి ముత్తవ్వ, కారేద రమణారెడ్డి, తుమ్మనపల్లి కమలాకర్‌రావు, పినకాశి అనీల్‌కుమార్, చరణ్, నారాయణరెడ్డి, అనీల్ పాల్గొన్నారు.

గురుకుల ఆశ్రమ హనుమాన్ దేవాలయ కమిటీ ఎన్నిక

సిరిసిల్ల రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని సర్దార్‌నగర్ గురుకుల ఆశ్రమ హనుమాన్ దేవాలయ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ఏనుగుల ప్రభాకర్, ప్రధానకార్యదర్శిగా చిటికెన శ్రీనివాస్, కోశాధికారిగా ఏనుగుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బూట్ల సతీష్, అన్నల్‌దాస్ రాంబాబు, సహాయ కార్యదర్శిగా చింతకింది మల్లిఖార్జున్, ప్రచార కార్యదర్శిగా వెంగళ భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

వృద్ధుల ఆశ్రమంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ జన్మదిన వేడుకలు

గంభీరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేటలోని 'మా' అనాథ వృద్ధుల ఆశ్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు, మిత్రులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి, స్వీట్లు అందజేశారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, నాయకులు సాదత్, జుబేర్, వెంకటి, అస్లామ్, అక్కపల్లి బాలయ్య, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

రేపా ఆధ్వర్యంలో సన్మానం

ఎల్లారెడ్డిపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని యమగొండ శ్రీజ-బాల్‌రెడ్డి దంపతుల కొడుకు సన్మయ్‌రెడ్డి బీటెక్ పూర్తిచేసి ప్రైవేటు సంస్థలో ఉద్యోగం సాధించడంతో రెడ్డి ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. దేవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గిరిదర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం

ముస్తాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా పిట్ల విఠల్, ఉపాధ్యక్షులుగా కంచం నర్సింలు, జింక మల్లేశం, ఈర్ల విద్యాధర్, గాడిచర్ల రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా జింక పవన్, జెల్ల శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా జాల భిక్షపతి, నిమ్మల రాములు, గీస భిక్షపతి, సోమరిపేట నర్సింలు, కోశాధికారిగా బోయిని గంగాధర్‌లను సంఘం నాయకులు, మాజీ అధ్యక్షులు పిట్ల రాంగోపాల్, గజ్జెల రాజు, గాడిచర్ల దేవయ్య, పుల్లూరి రవిల సమక్షంలో ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ముదిరాజ్ మండల సామాజిక వర్గం అభినందించారు.

రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు...

ముస్తాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు వెళతున్నట్లు ముస్తాబాద్ మండల సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాల మధ్య లూజ్‌గా వేలాడుతున్న వైర్లను తొలగిస్తూ నూతనంగా పోల్స్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఇప్పటికే మండలంలో 300 స్తంభాలను ఏర్పాటు చేసినట్లు అంజిరెడ్డి తెలిపారు. సెస్ పరిధిలో రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సెస్ ప్రగతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేత

కోనరావుపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొలనూరు గ్రామంలోని విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కొలనూరు గ్రామంలో విద్యార్థులు కలిసి క్రికెట్ కిట్ కావాలని అడగడంతో స్పందించిన కేంద్ర మంత్రి క్రికెట్ కిట్‌ను బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. విద్యార్థి దశలో కష్టపడినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా శంకర్, తిరుపతి, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, శేఖర్, దేవయ్య తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

రుద్రంగి, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రానికి చెందిన దాసరి భూమేష్ అనే యువకుడు వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు భూమేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భూమేష్‌ది నిరుపేద కుటుంబం కావడం ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో అతని కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయింది. ఈ విషయం తెలుసుకున్న 2000-01 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు భూమేష్ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గడప వేణు, భైరెడ్డి నరేష్, అల్లూరీ గంగారెడ్డి, మరిగడ్డ నరేష, లంక దాసరి శ్రీనివాస్, కాదాస్ మహేందర్, అంబటి శ్రీధర్, దరిపల్లి రవి, కాదాసు లక్ష్మణ్, రాణవేణి సందీప్ తర్రే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా జిల్లా అధికారి ప్రవర్తన..

తంగళ్లపల్లి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ పాటించాల్సిన జిల్లా అధికారి ప్రవర్తన వివాదాస్పదంగా ఉందని, కాంగ్రెస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్నాడని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబీంకర్ రాజన్న ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా కలెక్టర్ వ్యవహరిస్తున్నారన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే ఫొటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రొటోకాల్ లేని వ్యక్తి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేకే మహేందర్‌రెడ్డితో ఇళ్ల మంజూరు పత్రాలను ఎలా పంపిణీ చేయిస్తున్నారని ప్రశ్నించారు. కలెక్టర్ ఇసుక కొరత లేదని వ్యాఖ్యానించడాన్ని తప్పు పట్టారు. గతంలో 15 వందల ఉండే ట్రాక్టర్ ట్రిప్పు ఇప్పుడు రూ .4 వేలకు ట్రాక్టర్ ట్రిప్పు ఇసుక ఉందన్నారు. నిబంధనలు ప్రకారం తంగళ్లపల్లి మానేరు నుంచి ఇసుకకు అనుమతించి గృహ నిర్మాణదారులను ఆదుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో నాయకులు బండి దేవదాస్, మాట్ల మధు, గుండు ప్రేమ్ కుమార్, కందుకూరి రామగౌడ్, కుర్మ రాజు, కందుకూరి రామగౌడ్, రవీందర్ రావు, బండి జగన్, ఎన్నమనేని అమర్‌రావు, రవీందర్‌రెడ్డి, అఫ్రోజ్, శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.